# పితృదేవోభవ

"నాన్నగారూ!

ధనుర్మాసంలో మనుషులను ధనుస్సులా వంచిన చలి శివరాత్రి వచ్చే సరికి "శివ శివా" అంటూ పారిపోతుందని అమ్మ అనేది. అయితే మీరేమో జనవరి ఆఖరికే ఎండలు చిటపటలాడిస్తున్నాయని" రాశారు.

మన చెవులు గింగురుమనేలా హారను కొడుతూ ఎడతెరిపి లేకుండా అటూ ఇటూ పరుగెత్తే వాహనాలు, ఏ ఇంట చూసినా 'చల్లని తల్లి'గా వెలిసిన ఫ్రిజ్‌లు వీటి పుణ్యమా అని వాతావరణంలో చేరిన క్లోరోఫ్లోరో కార్బన్‌లు ఎండ నుంచి మనలని రక్షించే ఓజోను పొరను చిల్లులు పొడిచి పారేస్తుంటే ఎండలు మండిపోవడంలో ఆశ్చర్యమేముంది?

మనిషి, ప్రకృతి పరస్పర సహకారంతో బ్రతకాల్సిందిపోయి విచక్షణా రహితంగా ప్రకృతి వనరుల్ని వాడుకుంటున్నాము. అదుపు లేకుండా పెరిగే జనాభా వలన స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అయిదవ దశాబ్ధంలో కూడా ఇంకా వెనకబడే ఉన్నాంకదండీ. పదేళ్ళ క్రితం మేము బెంగుళూరు వచ్చిన కొత్తలో ఎండా కాలంలో కూడా ఇక్కడ ఫ్యాన్ల అవసరం కూడా ఉండేది కాదు. ఇప్పుడోమరి. ఇళ్ళ కొరత తీర్చడం కోసం శాటిలైట్ టౌన్లు వెలిశాయి. ఫ్యాక్టరీలు పెరిగాయి. అందుకే వేసవిలో ఇక్కడ కూడా 35 డిగ్రీలు దాటుతోంది వేడి.

జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోయిన ఈ రోజుల్లో మీ పెన్షను డబ్బు కేవలం ఇంటి అద్దెకు బుజ్జిగాడి కాన్వెంటు ఫీజుకు మాత్రమే సరిపోతున్నదనీ తమ్ముడి కుటుంబానికి పెద్దగా సహాయం చేయలేకపోతున్నాననీ బాధపడుతూ రాశారు. నాన్నగారూ! నాకు బాగా గుర్తుంది. నేను ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతున్నప్పుడు సెలవులకు అమ్మతో కలిసి మామయ్య ఇంటికి బెంగుళూరు వచ్చాను. అప్పుడు పిన్నీ వాళ్ళు విశ్వేశ్వరపురంలో ఉండేవాళ్ళుకదండీ! వచ్చే

ముందు మీరు నాకు పది రూపాయలు ఇచ్చారు జ్ఞాపకం ఉందా? చామరాజుపేట నుండి నడిచి విశ్వేశ్వరపురం వెళ్ళేసరికి కాళ్ళు నొప్పులు పుట్టాయి నాకు. సర్జన్ రావు సర్కిల్ దాకా వచ్చే సరికి "కాళ్ళు నొప్పి మావయ్యా!" అంటూ గోల చేశానుట. మావయ్య ఇప్పటికీ చెప్తాడు. పిన్ని కూతురు రేఖ నా కంటే చిన్నదే అయినా పెద్ద దానిలా ఏపుగా పెరిగి ఓణీలతో కనపడింది. ఇకనేం నాకు పౌరుషం పుట్టింది - ఓణీ వేసుకోవాలని. లేకపోతే దాని ముందు చిన్నతనం కదా మరి! మీరిచ్చిన పది రూపాయలు పెట్టి రెండు జార్జెట్ ఓణీలు కొనుక్కున్నాను. ఈ విషయం చెప్తే పిల్లలు ఎంత విచిత్రంగా చూస్తారో తెలుసాండీ? ఆ డబ్బుకు వాళ్ళకు ఒక ఐస్ క్రీమ్ రాదు కదా మరి. నేను "ఆంధ్రప్రభ" లో సీరియల్స్ రెగ్యులర్‌గా చదివేదాన్నని మీరు కేకలేసేవారు. గుర్తుందా? మామయ్య నా కోసమని బెంగుళూరులో ప్రతి వారం పావలా పెట్టి కొనుక్కొచ్చి ఇచ్చేవారు. ఆయన జీతం అప్పట్లో నూట యాభైట. అక్క చెల్లెళ్ళని ఆదరిస్తూ ఆ మహా పట్నంలో హాయిగా గడిపేవాడట. ఇప్పుడు వేల రూపాయలు సంపాదించే వాళ్లు కూడా స్పేస్ షిప్‌లో వేగంగా పైకి వెళ్లిపోతున్న ధరలను అందుకోలేక అల్లాడిపోతున్నారు. ఆర్థిక మంత్రిగారు మధ్య తరగతి మహిళల కోసం కాస్మెటిక్స్ మాత్రం తగ్గించారు. మరి మీరు తమ్ముడికి సహాయపడలేకపోతున్నానని దిగులు పడి ప్రయోజనం ఏమిటండి?

వరుణ్‌కి ఈ సంవత్సరంతో ఇంజనీరింగ్ అయిపోతుంది. పై చదువులకు అమెరికా వెళ్తే తప్ప ఫ్యూచర్ లేదు అంటాడు. ఇప్పుడే మైకేల్ జాక్సన్, మడోనా తప్ప మరొక సంగీతం వినడు. మిడ్డీల మినీల సంస్కృతి మన వాళ్లకు బాగా వంటబట్టింది కదా! ఇక అక్కడి వెళితే మనకు అందుతారా అని భయం వేస్తుంది నాకు. కానీ ఇక్కడ వీడికి ఉద్యోగం రావడం అంత సులభం కాదు కదా! అదీగాక మన దేశంలో ముప్పై సంవత్సరాలు పని చేసినా కారు గానీ, ఇల్లుగానీ కొనుక్కోలేము. అప్పో సొప్పో చేసి అమెరికా వెళ్లిన వాళ్లు రెండేళ్ళు తిరిగేసరికి కారు కొన్నామంటున్నారు. ఇక్కడ కారు కొనడమనేది మామూలు మధ్య తరగతి వాళ్ళకు ఒక కల మాత్రమే. మరీ మెటీరియలిస్ట్ లాగా ఆలోచిస్తున్నానంటారా?

నాగరికత పెరిగేకొద్దీ మనిషి దృక్పథం సంకుచితమైపోయి ప్రపంచం చిన్నదైపోతూందా అనిపిస్తోంది. ఈ మధ్య. బెంగుళూరులో పెరిగిన అమ్మచేసే బిసి బేళహుళి. మద్రాసులో పెరిగిన మీ కిష్టమైన అవియల్. మీ ఉద్యోగరీత్యా ఆంధ్రాలో పుట్టి పెరిగి ఇక్కడి ఆవకాయ, గోంగూర పచ్చడీ అన్నా ఎంతో ఇష్టంగా తింటాం మేము. ఇప్పుడేమిటో ఒకరి భాష మరొకరికి గిట్టదు. ఒక భాష సినిమాలు మరొక ప్రాంతంలో వద్దంటున్నారు. ఎవరికి వారుగా ఐసోలేట్ అయిపోవడం ప్రస్తుతం నాగరికత చిహ్నమా అనిపిస్తోంది. మా చిన్నప్పుడు వినాయక చవితి అంటే తొమ్మిది మంది ఇళ్ళకు వెళ్ళి గణపతిని చూసి గుంజీలు తీసిరమ్మని పంపేది అమ్మ. ఇప్పుడు వినాయక చవితి అంటే కర్ఫ్యూలు, చందాలు గుర్తొస్తాయి. సరే పోయిన సంవత్సరం మీ మనుమరాలు సాహిత్యను కనీసం పక్కింటికి వెళ్ళి అక్షింతలు వేసుకుని రావే అంటే "నేను పోనమ్మా వాళ్ళు

సినిమా చూస్తుంటారు. విసిగించినట్టుగా ఉంటుంది" అనేసింది. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా అయిపోతున్నాం కదా అని బాధ కలిగింది నాకు.

సరే! ఏమిటో రాస్తున్నాను. అసలు విషయం ఏమిటంటే మీరు ఫిబ్రవరి మొదటి వారంలో ఇక్కడికి వచ్చేయండి. అక్కడ ఎండలు తట్టుకోలేరు. మీరు వాడుకునే పడక కుర్చీ వార్నిష్ వేయించాను. మీ పట్టె మంచం నవారు బిగించి పెట్టమని వరుణ్‌కి, సాహిత్యకు చెప్పాను. పిల్లలు తాతగారి కోసం ఎదురు చూస్తున్నారు. తమ్ముడికి, మరదలికి నా ఆశీస్సులు తెలపండి. బుజ్జిగాడి పుట్టిన రోజుకు రెండు వందలు చెక్ పంపిస్తున్నాను. మీరు ఎప్పుడు వచ్చేది రాయండి.

ప్రేమతో

మీ

లలిత"

కూతురు రాసిన ఉత్తరం చదివే సరికి శంకరం గారి కళ్ళు చెర్చాయి.

"ఆడ పిల్లలంటే గుండెలమీది కుంపట్లు! అంటూ వాళ్ల పెళ్ళి గురించి ఒకటే దిగులుపడిన వాళ్ళ తల్లి సావిత్రమ్మ ఆ ముచ్చట చూడకుండానే కన్ను మూసింది. డిగ్రీ పూర్తికాగానే బ్యాంకులో ఉద్యోగం సంపాదించింది లలిత. ఉద్యోగం వచ్చిన ఏడాదిలో అదే బ్యాంకులో పని చేస్తున్న అబ్బాయితో పెళ్ళి కుదిరింది.

చిన్నప్పటి నుండి లలితకు ఆయన దగ్గర చనువెక్కువ. తండ్రి అన్న భయం కన్నా స్నేహితుడిలా అన్ని ఆలోచనలూ ఆయనతో పంచుకునేది.

చిన్నగా నిట్టూర్చి ఇంకొక కవరు చింపి చిన్న కూతురి నుంచి వచ్చిన ఉత్తరం బయటకు తీశాడాయన.

"నాన్నగారూ! నాకు జూనియర్ లెక్చరరుగా ప్రమోషను వచ్చింది. ఉరవకొండకు వేశారు. మీ ప్రోత్సాహంతో ఓపెన్ యూనివర్శిటిలో ఎం.ఎ. చేయడం ఎంతో మంచిదయింది. లేకపోతే ఎప్పటికీ స్కూలు టీచరుగానే ఉండిపోయేదాన్ని, మీరంటారు టీచరు పని అంత గొప్ప ఉద్యోగం మరొకటి లేదని కానీ నాన్నారూ! ప్రస్తుతం ప్రపంచంలో డబ్బుకు తప్ప మరిదేనికీ విలువలేదనిపిస్తుంది.

మనం రామచంద్రపురంలో ఉన్నప్పుడు నాకు వేణు మాస్టారు ట్యూషను చెప్పేవారు గుర్తుందాండీ? ఆ రోజుల్లో మేస్టారు పాఠం బాగా చెప్తే చాలు. వాళ్ళంటే పడిచచ్చేవాళ్ళం. వేణు మాస్టారు ఉండేది పూరిల్లే అయినా, కట్టేవి ముతక పంచలే అయినా, ఆయన అంటే మా క్లాసు వాళ్ళకు ఎంతో గౌరవం ఆయన చెప్పినట్టు లెక్కలు ఎవరూ చెప్పలేరని అనుకునే వాళ్ళం. కానీ ఈ రోజుల్లో స్టూడెంట్స్ "మేడమ్‌కి ఎన్ని చీరెలున్నాయి? ఎంత ఫాషనబుల్‌గా ఉంది? అనే దానిని బట్టే గౌరవమిస్తారు. ఇవన్నీ వింటుంటే మీకు తమాషాగా ఉందాండీ?

నా ప్రమోషను వలన మేము కొన్నాళ్ళు విడిగా ఉండాల్సి వస్తుంది. పిల్లలు తండ్రి కోసం దిగులు పెట్టుకుంటారేమో! అయినా రేపొద్దున్న వాళ్ళకు మంచి చదువులు చెప్పించాలంటే, సౌకర్యాలు సమకూర్చాలంటే మేము కొన్నాళ్ళు కష్టపడకతప్పదు. మీకు తెలుసు ప్రస్తుత సమాజంలో మనుషులకు కాదు విలువ. టి.వి. ఫ్రిజ్, స్కూటర్ వంటి స్టేటస్ సింబల్స్‌కే విలువ. ఇవన్నీ కావాలంటే సంపాదన పెరగాలి. అందుకే ధైర్యం చేసి ఒంటరిగా ఉండడానికి సిద్దపడి వచ్చి కాలేజీలో డ్యూటీ చేరాను. చిన్నిని చూసుకోవడానికి, పనిమనిషిని చూడాలి. ఇన్నాళ్ళూ ఆయనకు ఉదయం షిఫ్ట్ కాలేజీ. నాకు మధ్యాహ్నం షిఫ్ట్ స్కూలు గనుక ఆ అవసరం రాలేదు. చిన్నిని కొన్నాళ్ళు వాళ్ళ అత్తయ్య దగ్గర వదలుదామని అనుకున్నాం. కానీ వాళ్ళు యాత్రలకు వెళ్ళాలనుకుంటున్నాం వీలు పడదు అని రాశారు. మా అత్తగారు పెద్ద వయసు కదా. ఇవి నా అవస్థలు. టైఫాయిడ్ జ్వరం వస్తే పెద్దత్తయ్య వచ్చి రెండు నెలలు నన్ను అల్లారు ముద్దుగా చూసుకుందని అమ్మని కంటికి రెప్పలా కాచుకుందని అమ్మ చెప్పేది. ఆరోజులు కావుకదా ఇవి! ప్రస్తుతానికి మా కొలీగ్ కోమల వాళ్ళింట్లో చిన్నిని వదిలి కాలేజీకి వెడుతున్నా. ఆవిడ చెల్లెలు పావని చూస్తానంది. ఫస్ట్ నుండి పనిమనిషి వస్తుంది.

అక్కడ ఎండలు ఎక్కువ అవుతున్నాయని రాసారు. జాగ్రత్తగా ఉండండి. ఎండలో బయట తిరగకండి. వేసవికి అక్కయ్య దగ్గరికి బెంగుళూరు వెడుతున్నారా, అన్నయ్యకు వదినకు నా నమస్సులు తెలుపండి. బుజ్జికి చొక్కా పంపుతున్నా పుట్టిన రోజుకు. ఉత్తరం రాయండి.

ప్రేమతో, మీ

కుముద

రెండవ ఉత్తరం చదవడం ముగించి కళ్ళు మూసుకుని కుర్చీలో వెనక్కి వాలారు శంకరం గారు.

"మావయ్య కాఫీ" అంటూ కోడలు పిలవడంతో కళ్ళు తెరిచారు.

"ఆ సంచీ ఇలా తెచ్చివ్వమ్మా, కాఫీ తాగి బజార్లోకి వెళ్ళి కూరగాయలు తీసుకు వస్తాను అన్నారు.

"మీకెందుకు నాన్నా శ్రమ? నేను తీసుకువస్తాను కదా! ఇంతకీ అక్కయ్య చెల్లాయి ఉత్తరాల్లో విశేషాలేమిటి? అప్పుడే ఆఫీసు నుంచి వచ్చిన గంగాధరం అడిగాడు.

"నేను ఊరువెడితే నీకు ఎలాగు తప్పదు. ఉన్నంత వరకు నాకు చేతనైనంత వరకు సహాయం చేద్దామని తాపత్రయం" అన్నాడు శంకరంగారు నవ్వుతూ.

అయితే బెంగుళూరు ప్రయాణం ఉందన్న మాట! అంది కోడలు.

నవ్వి ఊరుకున్నారాయన. ఆ రాత్రి ఇద్దరు కూతుళ్ళకూ ఉత్తరాలు రాసారు.

"ప్రియమైన లలితకు! నీ ఉత్తరం అందింది. పిల్లలు పరాయి సంస్కృతి పట్ల

ఆకర్షితులవుతున్నారని నీ బాధ. మార్పు అనేది కాలధర్మం కదమ్మా. అయితే కేవలం వేష భాషలను మాత్రం అనుకరించడం కాక వారి క్రమశిక్షణను శుభ్రతను, పంక్చుయాలిటీనీ నేర్చుకుంటే మంచిది మన పిల్లలు ఏమంటావు.

నువ్వు జాగ్రత్తగా గమనిస్తే మైకేల్ జాక్సన్, మడొనాలతోబాటు అరైక్కుడి, ద్వారం, రవిశంకర్, భీమసేన్ జోషీల కాసెట్లు కూడా కనబడతాయి, నీ పిల్లల కలెక్షన్‌లో. నీకేం భయం అక్కర్లేదు. అమెరికా వెళ్ళినా మనవాళ్లు ఆవకాయ రుచి మర్చిపోరు. కాలిఫోర్నియాలో వున్నా కాకరపువ్వొత్తులు కాల్చనిదే దీపావళి సంబరం లేదనుకుంటారు. దూరంగా వున్నప్పుడు తమ అస్థిత్వాన్ని ఐడెంటిటీని మరింత పదిలంగా కాపాడుకొంటారు. తమాషా ఏమిటంటే ఇక్కడ వైట్ కాలర్ జాబ్స్ కావాలనుకునే వాళ్ళే అక్కడికి వెళ్ళేసరికి కాంటీన్‌లో పనిచేయడంలో డిగ్నిటీ ఆఫ్ లేబర్ ఉందని గ్రహిస్తారు. ఇక్కడ ఆషామాషీగ తీసుకునే చదువు, ఉద్యోగం అక్కడ యమ సీరియస్‌గా తీసుకుని కష్టపడతారు. ఆ సిన్సియారిటీ ఇక్కడ ఉంటే పైకి రావడానికి మార్గాలే లేవంటారా? విలువలు మారినా పరిసరాలు మారినా కన్నవారి మీద, మాతృదేశం మీద మమకారం మాత్రం వదలుకోరు. మీ పిన్ని కూతురు రేఖ అమెరికా నుండి ప్రతిఏడాదీ తల్లి తండ్రులను చూడ్డానికి రావడం లేదూ? అన్నట్టు రేఖ కూతురు పెళ్ళి కుదిరింది. వచ్చేనెలలో తిరుపతిలో చేస్తుందిట. అంచేతనీ పిల్లలు ఎక్కడ వున్నా తమదైన దాన్ని మర్చిపోరు.

ఇకపోతే మనిషి మనసూ ఆలోచనా ఇరుకైపోతున్నమాట నిజమే గానీ మనిషిలో ఎసెన్షియల్ గుడ్‌నెస్ మాత్రం ఉందనే అనిపిస్తుంది నాకు. పోయిన సంవత్సరం నువ్వు ఇక్కడకు వచ్చినప్పుడు మీ పక్కింటి వాళ్ళు పిల్లల్ని ఎంతో అక్కరతో చూసారని రాసావొకసారి. ఆ మధ్య లాటూరులో భూకంపం వచ్చినప్పుడు తెలుగు, అరవ, కన్నడ అని తేడాలు చూపారా జనం? లేదే! అవసరానికి అందరం ఒకటే అనుకోగలిగితే చాలదూ?

ఎండలు ముదరకముందే వచ్చేయమన్నావు. సంతోషం! నీ తండ్రి గురించి నువ్వు ఆలోచించినట్టే నా పిల్లల గురించి నేనూ ఆలోచిస్తాను కదా! నీ దగ్గరకు రావడం కేవలం నా విశ్రాంతి కోసం. ప్రస్తుతం కుముదకు నా అవసరం వుంది. ప్రమోషనుమీద ట్రాన్స్‌ఫర్ అయి ఒంటరిగా ఉంది. అంచేత వచ్చే వేసవికి నీ దగ్గరికి వస్తాను భగవంతుడు చల్లగా చూస్తే. పిల్లలకు ఆశీస్సులు.

ప్రేమతో,

మీ "నాన్న"

"అమ్మా కుముదా! చిన్ని గురించి చింత మరిచిపో, నేను ఎల్లుండి బయల్దేరి నీ దగ్గరికి వస్తున్నాను. మొన్న నీ ఓల్డ్ స్టూడెంటు ఒకతను వచ్చాడు. ఇక్కడ కలెక్టర్ ఆఫీసులో పనిచేస్తున్నట్లు. కుముదా టీచరు పుణ్యం వలననే నాకు సెలక్షన్ వచ్చింది. అంటూ నిన్ను చాలా ఇదిగా

తలచుకొన్నాడు. అంచేత అమ్మలూ! నిజాయితీగా పనిచేస్తే గుర్తింపు తప్పకవుంటుంది. మీ పెద్దత్తయ్య ఒంటరిది. అంచేత అన్ని రోజులు వచ్చి ఉండగలిగింది. మీ ఆడపడుచు తన సంసారం గురించి ఆలోచించడం తప్పుకాదు కదా! బంధువుల నుండి సహాయాన్ని హక్కుగా ఆశిస్తాము. అదే స్నేహితులు ఆయాచితంగా సహాయం చేస్తే కొండంత సంతోషపడతాము. ఒకప్పుడు అందరూ దగ్గర దగ్గర ఉండే రోజుల్లో బంధువుల సహాయం దొరికేది. ఇప్పుడు దేశాంతరంలో ఉంటున్నారు. ఆవులు కాచిన వాడే అర్జునుడు. స్నేహితులే ఆపద్బాంధవులు, ఏమంటావు.

స్టేటస్ సింబల్స్‌గా నువ్వు రాసినవి ప్రస్తుతం అవసరాలుగా మారాయి నీలాంటి ఉద్యోగినులకు. మనిషి యంత్రాలమీద ఆధారపడటం వలన వాతావరణం కలుషితమై పోతూందని బాధపడింది మీ అక్కయ్య. అందుకే మేరీ షెల్లీ కథలో ఫ్రాంకెయిన్‌స్టిన్‌లాగా యంత్రాలు మనకు యజమానులు కాకుండా జాగ్రత్తపడితే చాలు మనం! డబ్బు ప్రపంచాన్ని నడిపిస్తోంది గానీ మనం దాన్ని నడిపించడం నేర్చుకుంటే జీవితం ఇంకాస్త సుఖంగా గడుస్తుందనుకుంటా.

చిన్నికి ఆశీస్సులు.

ప్రేమతో

మీనాన్న

**ఆంధ్రప్రభ ఆదివారం సంచిక**

తేది : 2-2-1997